PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 124 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 01 మే 2026

### ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్‌కు టీజీవో ఘన స్వాగతం




### ప్రజల బాధలకు వేదికగా 'ప్రజావాణి'




## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

- ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం
- టీఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్




## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం






## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

- భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
- అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి
- కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం

**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ మిగతా2లో...

## జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం మిగతా2లో...



## త్వరలో ట్రైబల్ వర్సిటి క్యాంపస్ నిర్మాణం

- రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. మిగతా2లో...

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

- ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యావశ్యకం
- వీడ్కోలు సన్మానంలో డిజిపి శివధర్ రెడ్డి
- కొత్త డిజిపి సివి ఆనంద్‌కు అభినందనలు




**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్డ్ అవుతున్న సందర్భంగా పోలీస్ అధికారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ..32 ఏళ్లు సుదీర్ఘకాలంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు మిగిలాయన్నారు. వృత్తిలో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. మిగతా2లో...

## ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

● 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు ● 87.90 శాతం ఉత్తీర్ణతతో బాలిలు టాప్ ● 96.07శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ఫస్ట్ ● ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్




**అమరావతి,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ఉదయం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫలితాలను ప్రకటించారు. టెన్త్ ఫలితాల్లో 85.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 81.14 శాతం ఉత్తీర్ణతతో పోలిస్తే ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. టెన్త్ ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 82.68 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. 72.8 నుంచి 78.39కి ఉత్తీర్ణత శాతం మిగతా2లో...

## సలహాదారుగా విహెచ్ నియామకం




## హైదరాబాద్ పోలీసుల 'వ్యూహం'.. దేశానికే దిక్సూచి


● ఢిల్లీని కదిలించిన ఆపరేషన్ ఆక్టోపస్ ఉన్నత స్థాయి సమీక్షకు దారితీసిన పోలీసుల తెగువ 'మ్యూల్' ఖాతాల వేటకు జాతీయ కార్యాచరణ ● రంగంలోకి ఐ4సీ, సీబీఐ, ఆర్బీఐ




**న్యూఢిల్లీ, ఏప్రిల్30 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో తమ పంజా విసురుతున్న సైబర్ నేరగాళ్ల అక్రమ సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు హైదరాబాద్ పోలీసులు ఎక్కుపెట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' అస్త్రం ఇప్పుడు దేశవ్యాప్త సమరానికి దిక్సూచిగా మారింది. 32 మంది బ్యాంక్ అధికారులను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ యంత్రాంగం ప్రదర్శించిన అసమాన తెగువ, వ్యూహాత్మక చొరవ దేశ రాజధాని ఢిల్లీని కదిలించడమే కాక, కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించేలా ప్రేరేపించింది. డిజిటల్ ఆర్థిక మోసాల్లో కీలకమైన 'మ్యూల్' ఖాతాల అక్రమ చలామణీని ఛేదించడంలో హైదరాబాద్ పోలీసులు సాధించిన అద్భుత విజయాలను కేంద్ర ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఒక ఆదర్శ నమూనాగా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నేతత్వంలో ఢిల్లీలో గురువారం జరిగిన కీలక సమావేశం.. సైబర్ నేరాల నియంత్రణలో ఒక నవశకానికి నాంది పలికింది. హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పాల్గొన్నారు. ముఖ్యంగా అమాయకుల పేరిట తెరిచే మ్యూల్ ఖాతాలను మిగతా2లో...

## 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

- ఢిల్లీలో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణం
- క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్లు
- మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు గ్యారెంటీ
- ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణ




## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

● కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
● మేడు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్



**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మే డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు.

మిగతా2లో...

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

**హైదరాబాద్/అమరావతి,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిం చారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 – 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం


(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పె÷–టటెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేం దుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయా దేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిష నర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

## అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన

**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే



వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

# హైదరాబాద్ పోలీసుల 'వ్యూహం'.. దేశానికే దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

నేరగాళ్లు ఎలా వినియోగించు కుంటున్నారో పక్కా ఆధారాలతో సహా బహిర్గతం చేయడంతో కేంద్రం అప్రమత్తమైంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అందించిన క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ఐ4సీ, సీబీఐ, ఆర్బీఐ వంటి అగ్రశ్రేణి సంస్థలతో పాటు వివిధ బ్యాంకుల ఉన్నతాధి కారులతో కేంద్రం ప్రత్యేక సమీక్ష నిర్వహిం చింది. ఈ భేటీలో హైదరాబాద్ పోలీసుల పనితీరును ప్రత్యేకంగా కొనియాడడమే కాకుండా, ఇక్కడి విజయవంతమైన మోడల్‌ను దేశమంతటా అమలు చేయాలని నిర్ణయించింది.
నేరగాళ్ల వేటలో మరింత వేగం పెంచేందుకు 'మ్యూల్ హంటర్. ఏఐ' అనే కృత్రిమ మేధస్సు సాధనాన్ని తక్షణమే వినియో గంలోకి తీసుకు రావాలని ఆర్బీఐ బ్యాంకులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సమన్వయ లోపం లేకుండా పోలీసులు, బ్యాంకులు రియల్ టైం డేటాను పంచుకో వాలని, ఎస్ఎల్‌బీసీల ద్వారా ప్రజల్లో విస్తృత అవగా హన కల్పించాలని ఈ సమావేశం దిశానిర్దేశం చేసింది.

హైదరాబాద్ పోలీస్ యంత్రాంగం ప్రదర్శించిన ఈ కార్యదక్షత మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిదాయ కమని కేంద్ర అధికారులు అభిప్రాయ పడ్డారు.

వెరసి, హైదరాబాద్ పోలీసుల అలుపెరగని పోరాటం ఇప్పుడు దేశవ్యాప్త సైబర్ భద్రతకు ఒక కొత్త మార్గదర్శిగా నిలు స్తూ, మోసగాళ్ల ఆట కట్టించేందుకు యావత్ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది.

# 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

**అమరావతి,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉద్యోగ, మౌలిక వసతులు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల వంటి అంశాలపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడున్నర గంటలపాటు సమావేశమైన మంత్రివర్గం.. దాదాపు 20కిపైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఢిల్లీలో 11.5 ఎకరాల్లో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపిందన్నారు. మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల లీజ్ రెన్యువల్, అద్దె నిర్ణయ విధానాల సవరణలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్టసవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. రామాయపట్నంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.354 కోట్ల మేర పాలనా అనుమతులకు అంగీకారం తెలిపింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్ల వ్యయానికి అంగీకారం తెలిపింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతికి పచ్చజెండా ఊపింది. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో 21 కొత్త పోస్టులు సృష్టించేందుకు అంగీకారం తెలిపింది.

రూ.2,540 కోట్లతో అమరావతిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. కృష్ణానది ఫ్లడ్ ప్రొటెక్షన్ పనులతో పాటు అమరావతిలోని సచివాలయం గ్లాస్ క్లాడింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్ట్ బాధితులకు గృహ యూనిట్ ఖర్చు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ పరిసరాల్లో సివిల్ వర్క్స్ కోసం రూ.798 కోట్ల ప్రణాళికతో పాటు ఉండవల్లి జోన్‌లో మౌలిక వసతుల కోసం రూ.580 కోట్ల ప్రణాళికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

# శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ఎ÷–లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట– విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్–యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పెరిగింది. వాట్సాప్ 'మన మిత్ర' సేవ ద్వారా 9552300009కు మెజేజ్ పంపి ఫలితాలను తెలుసుకోవచ్చు. టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు. 'మీ కృషి, అంకితభావం ఫలించాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దు. ఇది ఒక పరీక్ష మాత్రమే. మళ్లీ ధైర్యంగా ప్రయత్నించండి. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి పూర్తి మద్దతు ఇస్తుంది' అని లోకేశ్ పేర్కొన్నారు.మొదటి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా – 96.07శాతం ఉత్తీర్ణత సాధించగా, రెండో స్థానంలో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ 95.85శాతం ఉత్తీర్ణత సాధించింది. మూడో స్థానంలో విజయనగరం – 91.08శాతం, చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా – 57.12శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాల వారీగా ఉత్తీర్ణత వివరాలు ఇలావున్నాయి. కర్నూలు జిల్లా – 71.08,విశాఖపట్నం – 89.51,గుంటూరు – 88.89,తూర్పు గోదావరి – 88.49, కృష్ణా జిల్లా– 88.06, ఎన్టీఆర్ జిల్లా –87.91,నెల్లూరు – 87.37,అనంతపురం – 77.17, చిత్తూరు– 76.69 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం హాజరైన విద్యార్థులు – 6,18,131కాగా, ఉత్తీర్ణులైన విద్యార్థులు – 5,26,954 పాసయ్యారు. రీకౌంటింగ్ / రీ–వెరిఫికేషన్: ఫలితాలపై అసంతృప్తి ఉన్న విద్యార్థులు మే 1 నుంచి మే 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీ–వెరిఫికేషన్‌కు రూ.1,000 ఫీజు చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారి కోసం మే 25 నుంచి జూన్ 4 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అపరాధ రుసుము లేకుండా మే 9 వరకు, రూ.50 అపరాధ రుసుముతో మే 10 నుంచి మే 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. స్జబెక్టు వారీగా మార్కుల మెమోలు నాలుగు రోజుల్లో అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

# సలహాదారుగా విహెచ్ నియామకం

**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబి నెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

**హైదరాబాద్,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

# యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట


(మొదటి పేజీ తరువాయి)

పోలీసింగ్ విధానంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, యువ పోలీస్ అధికారులు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసిచారు. తన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని సీవీ ఆనంద్ తెలిపారు. 1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థితులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు.

# గోమాత సేవలో ముందుండే సేవా దృక్పథం
# సత్తుపల్లిలో గో గ్రాసం సమర్పణ



**కల్లూరు, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గోమాత సేవే గొప్ప సేవ అనే భావంతో సత్తుపల్లి పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి అనుబంధంగా ఉన్న గోశాలలో విశేష కార్యక్రమం జరిగింది. శ్రీ శ్రీశ్రీ తేరాల సుబ్రహ్మణ్యం శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ గోశాలలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద బోయిన శ్రీనివాసరావు వారి దంపతులు గో గ్రాసం సమర్పించి గోమాత పట్ల తమ భక్తిని, సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గోమాతకి జై నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. నోరులేని మూగజీవాలైన గోవులకు పశుగ్రాసం అందించడం ద్వారా మానవతా దృక్పథాన్ని ప్రతిబింబించిన శ్రీనివాసరావు సమాజానికి ఆదర్శంగా నిలిచారు. గోవులో దైవాన్ని దర్శించే సాంప్రదాయాన్ని పాటిస్తూ, భక్తి మరియు సేవ కలయికతో ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషం. శ్రీనివాసరావు రాజకీయ రంగంలో కూడా చురుకైన పాత్ర పోషిస్తూ, ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై ఉంటారు. పార్టీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో ముందుండే ఆయన, ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కృషి చేస్తూ గుర్తింపు పొందారు. పార్టీకి విధేయుడిగా, సీనియర్ నాయకుడిగా అవసరమైన సమయంలో మార్గదర్శక సూచనలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే ఆయన, ఎప్పటికప్పుడు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గోమాత సేవ వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో సానుకూల సందేశం





చేరవేస్తూ, సేవా గుణం కలిగిన నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొని గోమాత సేవ ప్రాముఖ్యతను వివరించారు.

# ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్‌కు టీజీవో ఘన స్వాగతం

**- జిల్లా అభివృద్ధికి కలిసి నడుస్తాం**

**- టీజీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టీఎస్‌కు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) ఖమ్మం జిల్లా కార్యవర్గం గురువారం ఘనంగా స్వాగతం పలికింది. జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వాగత కార్యక్రమం ఆప్యాయతతో, పరస్పర గౌరవంతో నిండింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాను రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే లక్ష్యంతో సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించడంలో కలెక్టర్ నాయకత్వంలో ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో



టీజీవో ఎల్లప్పుడూ ముందుండి, ప్రభుత్వంతో సమన్వయం సాధిస్తూ సేవలందిస్తుందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ములుగు జిల్లాలో నిర్వహించిన టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని స్మరించుకుంటూ, సమ్మక్క-సారక్క జాతర సమయంలో ప్రత్యేక దర్శనం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ అనుభవం తమకు మరపురాని అనుభూతిని కలిగించిందని చెప్పారు. స్నేహభావం, సేవాభావం, పరస్పర నమ్మకం ఈ మూడు విలువలతో జిల్లా అభివృద్ధి దిశగా కలెక్టర్ దివాకర టీఎస్ నాయకత్వంలో ఖమ్మం కొత్త దిశగా



పయనించనుందని ఈ సమావేశం స్పష్టంచేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కనపర్తి వెంకటేశ్వరరావు, బి. హరీష్, డి. బాలాజీ, తాజుద్దీన్, ఎం. సతీష్, బి. శారద తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నారి విజయలక్ష్మి, బి. కిషోర్ బాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు శ్రీకాంత్, పొట్టపెంజర రామయ్య, పవన్ కుమార్, డాక్టర్ వేణుమాధవ్, డిసిహెచ్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, సిపిఓ శ్రీనివాసరావు, డీఎస్ఓ చందన్ కుమార్, డిపిఓ రాంబాబు తదితరులు హాజరయ్యారు.

# ప్రజల బాధలకు వేదికగా 'ప్రజావాణి'





**- కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**- కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో హృదయాన్ని తాకిన ప్రజాదర్బార్**

**- సంజీవరెడ్డి భవన్‌లో వినిపించిన ప్రజల స్వరం**

**- సమస్యల పరిష్కారానికి నాయకుల హామీ**

**- ప్రతి విజ్ఞాపనకు స్పందన కల్పిస్తామని భరోసా**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల బాధలకు వేదికగా 'ప్రజావాణి' నిలవనుందని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ గురువారం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు వేదికగా మారింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల సహకారంతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో "ప్రజావాణి" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హాజరై ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. ప్రజల నుంచి అందిన విజ్ఞాపన పత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. "ప్రజాదర్బార్"గా కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్ని ఇకపై "ప్రజావాణి"గా పిలుస్తామని ప్రకటించారు.



ప్రజల స్వరమే తమకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ముఖ్య అతిథి రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రతి పౌరుడు దీన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ఇది ఓ ఆశాకిరణంగా నిలుస్తుందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ప్రజల బాధలను వినిపించే వేదికగా నిలుస్తుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఉన్నత స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార దిశగా అడుగులు వేయాలనే సేవా భావం ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది. ప్రజల గుండెల్లోని మాటలకు స్వరం ఇచ్చే వేదికగా "ప్రజావాణి" నిలుస్తూ, సమస్యల పరిష్కారానికి ఆశాకిరణంగా మారుతుందనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, ఐ.ఎన్.టి.యూ.సి జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్, పిసిసి సభ్యులు జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు తూములూరి లక్ష్మీ నరసింహారావు, కళ్యెం వెంకటరెడ్డి, పసుపులేటి దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు వల్లూరి పట్టాభి, కిలారి అనిల్, మహ్మద్ హాఫీజుద్దీన్, పులిబండ్ల చిట్టిబాబు, కంచర్ల వెంకటనర్సయ్య, మామిడి వెంకన్న, ధారావత్ బాబు, జిల్లా అధికార ప్రతినిధులు కల్వకుంట్ల గోపాల్, కర్నాటి రామారావు, జిల్లా కార్యదర్శులు చింతమల్ల రవి, బోజెడ్ల సత్యనారాయణ, దామా స్వరూప, ఇజ్జగాని శ్రీలత, నర్రా భద్రకాళి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలూరి రవికుమార్, రంగా జనార్ధన్, గజ్జి సూర్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి

**● రథయాత్రను జెండా ఊపి ప్రారంభించిన రాజేందర్ రెడ్డి**

**● హిందూ సమ్మేళన ప్రచార రథ యాత్ర ప్రారంభం**



**తొర్రూర్ ప్రతినిధి,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ మే 3 ఆదివారం సాయంత్రం గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి ప్రచార రథయాత్రని హిందూ సమ్మేళనం కార్యక్రమ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉన్న హిందూ వర్గాలు పాటుపడాలని ఐకమత్యంగా కలిసి ఈ సమావేశం అధిక సంఖ్యలో జనం పాల్గొనాలని శ్రీశ్రీశ్రీ సద్గురు మహాదేవ్ స్వామీజీ, ప్రధానవక్తగా తెలంగాణ ప్రాంత కుటుంబ ప్రబోధన్ సహ సంయోజక్ మహిళా వర్తక సంకేపల్లి కీర్తన రెడ్డిలు పాల్గొన్నారు, 10 సంస్కృతి కార్యక్రమాలు ప్రసంగాలు ఉంటాయని సమావేశ అనంతరం మహా అన్న ప్రసాద వికారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి తొరూరు బాధ్యులు గుజరాతి శివకుమార్ ఇమ్మడి రాంబాబు, గంధసిరి వెంకన్న, ప్రొద్దుటూరు రుద్రదేవ్, హరిబాబు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నేడే మేడే...

**● మే డే సందర్భంగా ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ● ముఖ్య అతిథిగా తొర్రూరు మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్ తునం శ్రవణ్ కుమార్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం**



**తొర్రూర్ ప్రతినిధి,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు పట్టణంలో మొట్టమొదటిసారిగా మేడే కార్యక్రమాన్ని జెండా ఆవిష్కరణ చేసేందుకు నూతనంగా ఎన్నుకోబడిన ముఖ్యఅతిథిగా తొర్రూర్ మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్ తునం శ్రావణ్ కుమార్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటలకు తొర్రూరు పట్టణంలోని కూరగాయల మార్కెట్ దగ్గర కార్యక్రమం ఉంటుందని ఏఐటియుసి నాయకులు విషయాన్ని వెల్లడించారు. స్థానికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలోఓమ బిక్షపతి, ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు.మధుర బోయిన వెంకన్న, సిపిఐ పార్టీ తొర్రూరు టౌన్ అధ్యక్షులు.

# చొప్పదండి నియోజకవర్గంలో టాప్ మార్కులతో అక్షర హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం..




**రామడుగు ఏప్రిల్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్న విడుదలైన SSC2026 ఫలితాల్లో గుండిగోపాలరావుపేటలోని అక్షర హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో చొప్పదండి నియోజకవర్గ స్థాయిలోనే విశేష ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన 105 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ ఫలితాల్లో కొలిపాక మధుమిత 589 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలోనే టాప్ మార్కులు సాధించగా, ఎగుర్ల హర్షిని 586 మార్కులు, శ్రీరామోజు శ్రీజ 581 మార్కులు, మ్యాడరపు నీతువచన్ 574 మార్కులు సాధించి ప్రతిభను చాటుకున్నారు. మొత్తం 24 మంది విద్యార్థులు 550 పైన మార్కులు సాధించగా, 69 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారు. ఈ ఘన విజయంలో భాగస్వాములైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ మినుకుల రాధ, ఉపాధ్యాయ బృందం మరియు తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.


# పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన నాగటి విష్ణువర్ధన్

**● అభినందించిన చిలుకోడు మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ భాను**




**డోర్నకల్, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీరోల్ మండలం చిలుక్కోయలపాడు గ్రామానికి చెందిన నాగటి ప్రభాకర్ - భద్రకాళిల ప్రథమ పుత్రుడు నాగటి విష్ణు వర్ధన్ పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 549 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నాడు. పట్టుదల, కృషి, సమయపాలనతో చదువులో ముందంజలో నిలిచిన విష్ణువర్ధన్ ఉత్తమ మార్కులు సాధించి గ్రామానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. చిలుకోడు మోడల్ స్కూల్‌లో చదువుతున్న విష్ణువర్ధన్ తన లక్ష్యసాధన కోసం రోజూ క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల సూచనలు పాటించడం వల్ల ఈ విజయాన్ని సాధించాడని గురువులు తెలిపారు. సాధారణ కుటుంబానికి చెందిన ఆయన కష్టపడి చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని నిరూపించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ భాను విద్యార్థిని ప్రత్యేకంగా అభినందిస్తూ, "విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకుంటే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరు. విష్ణువర్ధన్ మా పాఠశాలకు గర్వకారణం. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు కూడా విష్ణువర్ధన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అతని విజయానికి కారణమైన తల్లిదండ్రుల సహకారం, మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ కుమారుడు మరింత ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో చిలుక్కోయలపాడు గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, స్నేహితులు, సహ విద్యార్థులు విష్ణు వర్ధన్‌కు అభినందనలు తెలియజేస్తూ, ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



**ఉప్పల్, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** దళిత రత్న అవార్డు గ్రహీతలు సంతోష్ కుమార్, కోరపాక అంజిలను బీజేపీ మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్, మల్లెల నర్సింగరావు (బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు) కలిసి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గానికి దళిత రత్న అవార్డులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. సమాజానికి సేవా భావంతో నిరంతరం ప్రజల్లో మమేకమై సేవలు అందిస్తున్న అవార్డు గ్రహీతలను అభినందించారు. డాక్టర్. బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టుకుని రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాచారం డివిజన్ అధ్యక్షుడు కుమ్మగళ్ల నవీన్, అధికార ప్రతినిధి గోపాల్, ప్రకాష్, సాయి, ఉదయ్, వెంకటేష్, గోపి, మంజుల వాణి, టీలు, మేడ్చల్ ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు గ్రామపంచాయతీ ఘన సన్మానం..



**రామడుగు ఏప్రిల్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో రామడుగు మండలం గుండి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా గురువారం గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం విద్యార్థులను ఘనంగా సన్మానించింది. సర్పంచ్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, పదవ తరగతి భవిష్యత్తులో ఎదగడానికి తొలి మెట్టు అని అన్నారు. 600 మార్కులకు గాను 536 మార్కులు సాధించిన అయేషా సిద్దికా, 531 మార్కులు సాధించిన మంద కీర్తనలకు పూల మొక్కలు అందించి శాలువాలతో సత్కరించారు. ఉప సర్పంచ్ సయ్యద్ ఫిరోజ్, వార్డు సభ్యులు సయ్యద్ సోయల్, వెన్నంపల్లి ఆంజనేయులు, ముంజాల రజిత ప్రవీణ్, స్కూల్ కమిటీ చైర్మన్ కొమరవ్వ, గ్రామ కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, మానుపాటి వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, గుమ్మడి ప్రశాంత్, ఉపాధ్యాయులు దయాకర్, ఉమర్ అలీ, మంజుల, కవిత, జయ, వినయ్ కుమార్, విజయలక్ష్మి, రమేష్ తదితరులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విహెచ్‌కు అభినందన సత్కారం





**కాచిగూడ, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు బీసీ సంక్షేమ శాఖకు మంత్రి హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన సందర్భంగా జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, బర్కత్ పుర మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యాశాఖలో వింత విడ్డూరం

- ఎప్పుడు బడికి పోనోడు 530 మర్క్‌లతో ఎస్ఎస్సి పాస్....
- విద్యార్థి హాజరు శాతం 10% మరి పది ఎలా పాసయ్యాడు...

**మహబూబాబాద్ జిల్లా,ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గూడూరు మండలం విద్యాశాఖ లో వింత అనుభవం ఎదురైంది ఎప్పుడు స్కూల్ కు వేళ్లని ఓ విద్యార్థి 530 మార్కులతో పాసయ్యాడు తాను పాసైతననే నమ్మకం లేక తన ఫలితాలు కూడా చూడలేదు. పాఠశాల నుండి విద్యార్థి తండ్రి కి ఉపాధ్యాయులు ఫోన్ చేసి మీ అబ్బాయి 530 మార్కులతో పాసయ్యాడు అని చేప్పగ ఆ తండ్రి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో ఎప్పుడు బడికి పోనోడు పది ఎలా పాసయ్యాడు అని వింతగా నువ్వుకున్నారు. ఏదేమైనా కష్టపడి చదివినోడు, అసలే చదవనోడు ఈ పది ఫలితాలలో ఇద్దరు ఒక్కటైయ్యారు.

## కొండపల్లి పద్మిని దేవికి ఎమ్మెల్యే రామచందర్ నాయక్ ఘన నివాళి



**సీరోల్, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొండపల్లి రఘురాం రెడ్డి మాతృమూర్తి పద్మిని దేవి మరణం పట్ల డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, పద్మిని దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పద్మిని దేవి ఎంతో సాదాసీదా జీవనం గడుపుతూ కుటుంబ విలువలను, మానవత్వాన్ని కాపాడిన మహానుభావురాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆమె చూపిన మార్గం, కుటుంబానికి అందించిన సంస్కారాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా కొండపల్లి రఘురాం రెడ్డి గురించి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఆయన సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండి పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. తల్లి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సమాజానికి సేవ చేయడం ఆయనకు నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. ఈ కఠిన సమయంలో రఘురాం రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని, పద్మిని దేవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, జిల్లా కార్యదర్శి కాసం శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ రమేష్, సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, చిలుకలపాడు గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న, మన్నెగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు మడికంటి నరసయ్య ,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పద్మిని దేవి సేవలను స్మరించుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు.

## ఐదు రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూల ఫలితాలు: తెలంగాణలో డబుల్ ఇంజన్ లక్ష్యంగా ముందుకు




**కరీంనగర్,ఏప్రిల్30(పీసీడబ్ల్యూన్యూస్):** ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి అనుకూల ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పార్టీకి వచ్చిన నివేదికల ప్రకారం అంచనాలకు మించిన విజయాలు సాధిస్తామని అన్నారు. గురువారం కరీంనగర్‌లోని అదితి హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణలో రాజకీయ మార్పులకు నాంది పలికేలా మే 10న ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి రానున్నట్లు తెలిపారు. ప్రధాని బాధ్యతలు మూడోసారి స్వీకరించిన తరువాత తెలంగాణకు ఇది తొలి పర్యటన అని పేర్కొన్నారు. ఆ రోజు నిర్వహించనున్న "జనాగ్రహ సభ"కు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని, ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పుతుందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్, ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. పాలనలో స్పష్టత లేకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీపై కూడా విమర్శలు చేస్తూ, అది కాలం చెల్లిన పార్టీగా మారిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, కరీంనగర్ మేయర్‌గా బీజేపీ అభ్యర్థి విజయం ప్రజల్లో మార్పుకు సంకేతమని డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను ఈ ఫలితాలు ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు.

## ఎంపీ చొరవతో ముష్టికుంట్ల వాసికి 2.25 లక్షల ఎల్ఓసీ

- ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి
- క్యాంపు కార్యాలయంలో అందజేసిన కాంగ్రెస్ నాయకులు



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి.. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అండగా నిలిచారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ఖాసీం సాహెబ్ భార్య షేక్ అమీరున్ దీర్ఘకాలిక కీళ్ళ వ్యాధితో బాధప డుతూ.. మెరుగైన వైద్యం కోసం సాయం చేయాల్సిందిగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిని గతంలో కలిసి విన్నవించుకుంది. వెంటనే స్పందించిన ఎంపీ సిఫారసు చేయగా.. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్ )లో మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) ద్వారా రూ.2,25,000 మంజూరయ్యాయి. ఈ మంజూరు పత్రాన్ని గురువారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ధరావత్ రామ్మూర్తి నాయక్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ బోనకల్ మండల నాయకులు బోయినపల్లి మురళి తదితరులు అందజేశారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎంపీ రఘురాం రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్ వన్‌లో భట్రాజు సంఘం ఎన్నికపై వివాదం : రద్దు చేయాలని డిమాండ్

- కోరం లేకుండా ఎన్నికలు? భట్రాజు సంఘంలో ఉద్రిక్తతలు తీవ్రం
- బాహ్య వ్యక్తి అధ్యక్షుడిగా ఎంపిక ఎన్నికలపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు
- సభ్యులకు సమాచారం లేకుండా ఎన్నికలు నిర్వహణ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు
- పారదర్శకత లేకపోవడంతో ఎన్నికలు రద్దు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది



**హైదరాబాద్ ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం హైదరాబాద్ జిల్లా-1 శాఖలో ఇటీవల నిర్వహించిన ఎన్నిక వివాదాస్పదంగా మారింది. మార్చి 22, 2026న జరిగిన ఈ ఎన్నికలను రద్దు చేయాలని ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ రిజిస్ట్రార్ మరియు హామీల కార్యాలయానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రతినిధుల ప్రకారం, ఈ ఎన్నికలు సరైన కోరం లేకుండా నిర్వహించబడినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 120 కుటుంబాలు ఉన్నప్పటికీ, కేవలం 28 మంది సభ్యులతోనే ఎన్నికలు జరపడం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. పలువురు సభ్యులు ఎన్నికల ప్రక్రియ గురించి ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇక అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రాంతం వాసి కావడం హైదరాబాద్ జిల్లా-1కు చెందినవారు కాకుండా మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందినవారని కమిటీ పేర్కొంది. అదనంగా సంఘ ఉపనిబంధనలను ఉల్లంఘిస్తూ సరైన సభ్యత్వ నమోదు లేకుండానే ఎన్నికలు నిర్వహించారని, తమ జిల్లాల్లో నివసించని వ్యక్తులను బాధ్యతలలో నియమించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, మార్చి 22న జరిగిన ఎన్నికల ఫలితాలను తక్షణమే రద్దు చేసి, అర్హులైన సభ్యులందరిని నమోదు చేసుకునేందుకు గడువు ఇవ్వాలని కమిటీ కోరింది. అలాగే, అధికారిక పర్యవేక్షణలో పారదర్శకంగా తిరిగి ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై విచారణ జరిపి, కొత్త ఎన్నికల తేదీని ప్రకటించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కమిటీ కోరింది.

## హిందూ సనాతన ధర్మసేవ సమితి ఆధ్వర్యంలో భాగ్యనగర్ కాలనీలో ప్రతిరోజు అంబలి, మజ్జిగ వితరణ..

- అంబలి, మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగని శ్రీనివాస్...






**కరీంనగర్, ఏప్రిల్30(పీసీడబ్ల్యూ న్యూస్):** హిందూ సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 49వ డివిజన్ భాగ్యనగర్ కాలనీలోని యూనియన్ బ్యాంక్ ముందు ప్రతిరోజు అంబలి, మజ్జిగ వితరణ చేపట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం రోజున గాండ్ల మహదేవ్ పుట్టినరోజు సందర్భంగా 49వ డివిజన్లోని భాగ్యనగర్ లో అంబలి వితరణ చేపట్టారు. ఇట్టి అంబలి వితరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎండాకాలంలో వేడిమిని తట్టుకోవాలంటే అంబలి,మజ్జిగ పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. భాగ్యనగర్లో మజ్జిగ, అంబలి వితరణ కార్యక్రమం చేపట్టడంఅభినందనీయమన్నారుఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బండ రమణారెడ్డి, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గాజా రమా శివరాం, కర్రే పద్మ అనిల్. సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు భూమ రావు, ఈగం రవికుమార్, నారోతం రెడ్డి, లంబ సుధాకర్ రెడ్డి, నలమాచూ సంతోష్, రాజు, ముదుగంటి ప్రవీణ్, ఎన్నం ప్రవీణ్, అప్పాల శ్రీనివాస్, పచ్చునూరి నరేందర్, నందెల్లి జమున, శిరీష, విజయ లక్ష్మి, అమలా తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగనివ్వం: కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ రూరల్,ఏప్రిల్30(పీసీడబ్ల్యూ న్యూస్):** రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగనివ్వమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్ వంటి పథకాల ద్వారా రైతులకు మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈవో రమేష్, కార్పొరేటర్లు గాదె రూప శ్రీనివాస్, మేకల వెంకటేష్, నాయకులు కాంరెడ్డి రాంరెడ్డి, బీరం ఆంజనేయులు, కపిల్ మాధవ్, శ్రీధర్ రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్, సాయిని తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కాంగ్రెస్ ద్వారానే సాధ్యం

**పెద్ద బోయిన శ్రీనివాసరావు మాజీ ఏఎంసీ డైరెక్టర్ వి.హెచ్. హనుమంతరావుకు బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా నియామకంపై శుభాకాంక్షలు**




**కల్లూరు, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజిక న్యాయం సాధించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని మాజీ ఏఎంసీ డైరెక్టర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్ద బోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాల అభ్యున్నతికి కీలకంగా పని చేసే వ్యక్తిగా వి. హెచ్. హనుమంతరావును బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని వి. హెచ్. హనుమంతరావు స్వగృహానికి వెళ్లి పెద్ద బోయిన శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష పాత్ర పోషించిన వి. హెచ్. హనుమంతరావు వంటి అనుభవజ్ఞుడైన నాయకుడికి ఈ బాధ్యతలు అప్పగించడం రాష్ట్ర ప్రభుత్వ సముచిత నిర్ణయమని ఆయన అన్నారు. బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం వి. హెచ్. హనుమంతరావు తన అనుభవాన్ని వినియోగించి ప్రజలకు మరింత సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ బలహీన వర్గాల పక్షాన నిలుస్తూ సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు.

# పుట్టినరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ

- చిన్నారి దర్శిత దాస్ సేవా స్ఫూర్తికి ప్రశంసలు
- కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ





**కల్లూరు, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధి కొర్లగూడెం గ్రామానికి చెందిన చాట్ల దేవదాసు, మణెమ్మ దంపతుల మనవరాలు చిన్నారి చాట్ల దర్శిత దాస్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది. చాట్ల సునీల్ కుమార్, సోనియా దంపతుల కుమార్తె దర్శిత దాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులు మరియు ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నుండి ఉపశమనం పొందేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అందరి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమం చాట్ల అనిల్, స్నేహప్రియ దంపతులు, చాట్ల అఖిల్ సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా టీం సత్తుపల్లి సభ్యులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు చాట్ల సునీల్ కుమార్, సోనియా దంపతులను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా పుట్టినరోజును జరుపుకోవడం మంచి సందేశమని కొనియాడారు. అదేవిధంగా, చిన్నారి దర్శిత దాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరెన్నో ఇలాంటి సంతోషకరమైన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ ఐ&పిఆర్ కమీషనర్‌తో తెలంగాణ జర్నలిస్ట్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సమాచార,పౌర సంబంధాల శాఖకు ప్రత్యేక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. ముకుంద రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ జర్నలిస్ట్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి జేఏసీ కన్వీనర్లు కే. కోటేశ్వరరావు,అనంచిన్ని వెంకటేశ్వరరావు,కో కన్వీనర్లు నర్సింహా చారి, పురుషోత్తం,బాపట్ల కృష్ణమోహన్,ఎష్ట్ర. వెంకటేశ్వర్లు, కిషోర్ తదితరులు. ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ కన్వీనర్లు తో మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డులు అర్హత కలిగిన వారికి తప్పకుండా అందచేయాలని, కేబుల్ టీవీ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ ఇవ్వాలని అన్నారు. కమిషనర్ స్పందిస్తూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ నిరంతరం ఉంటుంది అని, అర్హత కలిగిన జర్నలిస్టులు అందరికి న్యాయం చేస్తాము అన్నారు.

# శాంతినగర్‌లో పౌరహక్కుల అవగాహన సదస్సు... ప్రజల్లో చైతన్యం

**- రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, భూమి హక్కులపై చర్చ**



**కల్లూరు, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో శాంతినగర్ కమిటీ హాల్‌లో గురువారం సాయంత్రం 6 గంటలకు పౌరహక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 19వ వార్డు కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధ వీరస్వామి హాజరై పర్యవేక్షించారు. ఈ సదస్సులో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, వివక్షా పూరిత చర్యలు వంటి అంశాలపై అధికారులచే విపులంగా వివరించారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకొని, చట్టపరమైన రక్షణను పొందాలని సూచించారు. రెవెన్యూ అధికారుల రాకతో శాంతినగర్ నివాసితులు పలు సమస్యలను ముందుకు తెచ్చారు. ముఖ్యంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ప్రభుత్వ గుర్తింపు లేని వారసత్వ భూముల నమోదు విధానం, శాంతినగర్‌లోని నివాస స్థలాల చట్టబద్ధ స్థితి వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందేహాలకు అధికారులు సమగ్ర సమాధానాలు ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గుర్రాల సుధీర్ కుమార్, ఖమ్మంపాటి ప్రకాష్, ఖమ్మంపాడు వెంకటేశ్వర్లు, వరదయ్య, రావూరి సీతారాములు, కాకాటి శీను, ఖమ్మంపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా పౌరహక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందడంతో పాటు, భూమి సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గదర్శకత్వం లభించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# క్రమశిక్షణ పట్టుదల ఉపాధ్యాయుల మార్గదర్శకతతో ఈ విజయాన్ని సాధించాం: బుచ్చిరెడ్డి

**విద్యార్థుల కృషి తల్లిదండ్రుల సహకారం మరువలేము**

**భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలి**










**ఉప్పల్ ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ సాయిరాం కాన్వెంట్ హై స్కూల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి ప్రతిభను చాటుకుంది. 2026 సంవత్సరానికి జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి, విద్యా ప్రగతిలో తమ ప్రతిభను నిరూపించారు. ఈ ఏడాది స్కూల్ టాపర్‌గా 2621131374 ఎం. ఎం.మనశ్వి నిలిచింది. ఆమె మొత్తం 585 మార్కులు సాధించి పాఠశాలలోనే కాకుండా వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లో అగ్రస్థానాన్ని అందుకుంది. ఈ సందర్భంగా సాయిరాం కాన్వెంట్ స్కూల్ చైర్మన్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకతతో ఈ విజయాన్ని సాధించినట్లు విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల నిబద్ధత వల్లే ఈ గొప్ప ఫలితాలు సాధ్యమయ్యాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన సాహితీ, భవాని, అనూష,విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ఫలితాలు మరోసారి ఈ విద్యాసంస్థ నాణ్యతను ప్రతిబింబిస్తున్నాయని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సాహకంగా నిలుస్తాయని తెలిపారు. మొత్తంగా, సాయిరాం కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు ఈ సంవత్సరం కూడా అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారని ఈ సందర్భంగా తెలిపారు.

# నవ దంపతులకు ఆశీస్సుల జల్లు

- కామినేని ఇంట పెళ్లి వేడుకలో కాంగ్రెస్ నేతల సందడి
- అఖిల్ - శ్రావణిల వివాహ బంధానికి సాక్ష్యంగా నిలిచిన ఆత్మీయ అతిథులు
- కొత్త జంటను దీవించిన కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల ఆత్మీయ అనుబంధం అని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి అన్నారు. ఒక పవిత్రమైన వేడుక ఖమ్మం నగరంలో కన్నులపండువగా జరిగింది. కామినేని రవి - శైలజ దంపతుల కుమారుడు అఖిల్, శ్రావణి ల వివాహ మహోత్సవం బంధుమిత్రులు, సన్నిహితుల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు నగరంలోని పలువురు ప్రముఖులు హాజరై గురువారం సందడి చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు రాజకీయాలకతీతంగా, ఒకే కుటుంబ సభ్యులుగా ఈ వివాహ తంతులో పాల్గొని మానవీయతను చాటుకున్నారు. ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్, ఖమ్మం కార్పొరేషన్ కార్యదర్శి కోనేటి నారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జోగిపర్తి ఉపేందర్, నగర కాంగ్రెస్ నాయకులు మన్నే హరికృష్ణ తదితరులు హాజరయ్యారు. **ఆత్మీయ పలకరింపులు :** వచ్చిన అతిథులందరూ వధూవరులపై అక్షింతలు వేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు. కామినేని రవి కుటుంబ సభ్యులను పలకరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయ బాధ్యతల నడుమ కూడా కార్యకర్తలు, అభిమానుల ఇంట్లో జరిగే వేడుకలకు హాజరై, వారి సంతోషంలో భాగస్వామ్యం పంచుకోవడం నాయకుల సౌమ్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ వివాహ వేడుకకు హాజరైన నాయకులకు, ఇతర ప్రముఖులకు కామినేని రవి కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొత్తూరు ఆలయంలో ధ్వజస్తంభం వేడుక

**అన్నప్రాశనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**







**సత్తుపల్లి, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వేదమంత్రాల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భక్తులందరూ ఐక్యంగా ఆలయ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ను శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సత్తుపల్లి మండలం గౌరిగూడెం గ్రామానికి చెందిన మణికంఠ, హేమ దంపతుల కుమారుడి అన్నప్రాశన వేడుకకు హాజరై చిన్నారి యోగి హన్విత్‌ను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ఫీస్‌లో 25% రాయితీతో చెల్లింపుకు దరఖాస్తుదారులకు మరో అవకాశం

**కల్లూరు, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలోని ప్లాట్ల అనధికార లేఅవుట్ లో ప్లాట్ కొనుగోలు చేసిన ప్లాట్ యజమానులకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) ఫీజుల చెల్లింపులపై 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ 2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం 2026 మే 1 నుంచి జులై 31వ తేదీ వరకు మూడు నెలల కాలంలో ఫీజు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. కల్లూరు మునిసిపాలిటీ లో 2020 స్కీమ్ క్రింద 1851 మంది దరఖాస్తు చేసుకోగా 1747 మందికి ఫీస్ చెల్లిం చమని ఆన్లైన్ లో సమాచారంపంపగా అందులో కేవలం 242 మాత్రమే ఫీస్ చెల్లిం చారు. ఫీస్ చెల్లించిన వారికి అప్లికేషన్ పరిశీలించి ఇప్పటికే 147 మంది ప్రొసీ డింగ్ ఇవ్వటం జరిగింది. మిగిలిన 1505 దరఖాస్తు దారులు ఈ 25% ఫీస్ రాయి తీ ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ తెలిపారు. మీరు చెల్లించ వలసిన ఫీస్ వివరాలు ఎల్ఆర్ఎస్ -2020 వెబ్సైట్ లో మీరు దరఖాస్తు చేసుకున్న ఫోన్ నెంబర్ తో సిటిజన్ లాగిన్ లో తెలుసుకోవచ్చు అని టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ తెలిపారు. ఏమైనా వివరాలు కోసం మున్సిపల్ కార్యాలయం లో సంప్రొంచించాలని మేనేజర్ నందిశెట్టి నాగేశ్వర్ రావు తెలిపారు.



# నేడే మేడే... ప్రపంచ కార్మికుల దినోత్సవం

- శ్రమ దోపిడీపై తిరుగుబాటు నే డే.
- కార్మికుల శంకరావం నేడే.
- ఒక మాటలో చెప్పాలంటే వర్గ పోరాటానికి పొద్దుపొడుపు నేడే.
- అలాంటి మేడే నేడే

**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 30(పీసీడబ్ల్యూ న్యూస్):** 10 శతాబ్దాలుగా కార్మికులు కట్టు బానిసగా జీవితం గడిపిన కాలం. న్యాయమైన పని దినాల కోసం ప్రపంచ దేశాలు న్యాయ పోరాటం చేసి విజయం సాధించుకున్న రోజు నేడే మేడే. ఆ రోజుల్లో కార్మికులు 10 నుంచి 14 గంటలు పని చేసేవారు దానికి నిరసిస్తూ 8 గంటల పని దినం కోసం పోరాటం చేశారు. ప్రభుత్వం మెడలు వంచి కార్మికుల హక్కులను సాధించుకున్నారు. దీనికోసం ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కండలు కరిగించే కష్టజీవులు వీళ్లు. నేడు పనికి విలువ ఉందని చెప్పే రోజు. పిడికిలిబిగించిన సంకల్పం నెరవేరిన రోజు. శతాబ్దం క్రితం ఒక్కొక్క పిడికిలి బిగించి కోట్ల మంది పోరాట జ్వాలను రగిలించింది. ప్రభువు వచ్చిన పల్లకిని మోసేది కార్మికుడు. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లు మోసిందిఓ కార్మికుడు. ఆధునిక సమాజంలో అలుపెరుగని పోరాటం అతను రక్తమాంసాలు చిందించి పోరాటం. సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదు ఆధునిక ప్రపంచ నిర్మాణంలో అలుపెరుగని పోరాటం కార్మికుని అతని రక్త మాంసాలు కలిగించి పని చేస్తేనే మనం ముందుకు సాగింది అలాంటి కార్మికుడు చరిత్రను తెలుసుకుందాం. ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావం కాదు శ్రమ దోపిడీని నిరసిస్తూ ఆ పరిశ్రమల్లో గాలి వెలుతురు కనీస సౌకర్యాలు లేకుండా రోజుకు 16 నుండి 18 గంటలు కార్మికులతో మార్కెట్లో జరిగిన కార్మికుల ప్రదర్శన ఈ





మేడే పుట్టుకకు నాంది పలికి తొలిసారిగా 1884లో రోజుకి 8 గంటలు మాత్రమే పని ఉండాలని కార్మికులు ఆందోళన ప్రారంభించారు. ఎందరో కార్మికులు పనిచేస్తుంటే వారి కష్టాన్ని చూసి కూడా ఓర్వలేక ఎందరో ఇంకా పని చేయించుకోవాలని అనుకునేవారు. ప్రస్తుతం మనం ఇప్పుడు చూస్తున్నాం ఉపాధి హామీ కూలీలు కూడా కష్టించి పని చేస్తున్న వారికి చేసిన పనికి పారితోషకం రాక అధికారుల చుట్టూ వేతనం కోసం తిరుగుతూనే ఉన్నా అభాగ్యులు ఎందరో. కొన్ని ప్రాంతాలలో అధికారుల నిర్లక్ష్యమా, కార్మికులు చేసుకున్న పాపమా వారు చేసిన పని దినాలకు వేతనం పోస్ట్ ఆఫీస్ లో వస్తుందని తెలుసుకొని కాళ్లు అరిగేలా పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతూ రాలేదు అనే సమాధానం తప్ప వారి చేతికి వేతనం వచ్చేది ఎప్పుడు? ఎందరో అభాగ్యులు ఇలాంటి మోసాలకు మోసపోయి డబ్బులు చేతికి అందక తనవులు చాలించిన వాళ్లు కూడా లేకపోలేదు. ఒకనాడు మనం కార్మికులు ఎర్ర బస్సుల వద్ద కూలీలుగా పనిచేసేవారు ఆ సమయంలో ఒక యూనిట్ గా ఉండి వారు చేసిన పనికి వచ్చిన రొక్కం



అందరూ పంచుకునేవారు నేటి రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో కూలీల వ్యవస్థను తొలగించి కార్గో పార్సిల్ గా మార్చి కూలీలకు పని లేకుండా చేస్తున్న ప్రభుత్వాలు?. అధునాతన యంత్రాలు రావడంతో కూలీలకు పూర్తిగా పనిచేసేందుకు పని దొరకక ఎందరో మంది నిస్సహాయులుగా మారుతున్నారు. ప్రతి నాయకుడు సమావేశాల సమయంలో ఉపన్యాసాలు ఉచితంగా ఇచ్చేవారు తప్ప కార్మికులకు న్యాయం చేస్తానని చెప్పి కూడా న్యాయం చేయకుండా పోయిన రోజులు ఎన్నో?. నేటి సమాజంలో చేతినిండా పని లేక మద్యానికి బానిసలు అవుతున్న వారిని కూడా చూస్తున్నాం?. కొన్ని వ్యాపార సంస్థల్లో వారి దగ్గర పని చేసే కార్మికులకు కార్మిక దినోత్సవం సందర్భంగా నేషనల్ హాలిడే అయినప్పటికీ హాలిడే ఇవ్వకుండా పని చేయించుకోవడం అలాకాకుండా ఆ రోజు డబుల్ వేతనం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవ్వకపోవడం కష్టజీవుల కష్టాన్ని శ్రమ దోపిడీకి గురి చేస్తూ పని చేయించుకుంటున్న వారందరూ ఉన్నారు?.

# గాయపడిన అంబేద్కర్‌కు మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



**తల్లాడ, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో ముద్దునూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు అంబేద్కర్ ఇటివల ముద్దనూరు నుంచి ఖమ్మం వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మంలోని టిఆర్ఆర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి తొందరగా కోలుకోవాలని కోరారు. ప్రమాదం జరిగిన సంఘటన గురించి అంబేద్కర్ నీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్ డాక్టర్స్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# జనగణనను సమర్ధవంతంగా నిర్వహించాలి

**కల్లూరు మున్సిపాలిటీలో సూపర్వైజర్,ఎన్యూమరేటర్ల శిక్షణ కార్యక్రమం**



**కల్లూరు, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్రం ప్రభుత్వం చేపట్టిన జనగణన 2027 కార్యక్రమాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని జనగణన మున్సిపాలిటీ అడిషనల్ చార్జ్ ఆఫీసర్ నందిశెట్టి నాగేశ్వరరావు ఎన్యూమరేటర్లకు సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు సంబంధించి చేపట్టబోయే జనగ ణనపై ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెమినార్ హాలు నందు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణను పరిశీలించిన అడిషనల్ చార్జ్ ఆఫీసర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం యాప్లో ఉన్న ప్రతి విషయాన్ని సక్రమంగా పూర్తి చేయాలని తెలిపారు.వార్డులలో సర్వే చేసేటప్పుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే అప్లోడ్ చేయాలనీ తెలిపారు. మూడు రోజులపాటు ఇచ్చే శిక్షణను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. జనగణన పూర్తిగా డిజిటలైజేషన్ ప్రక్రియలో సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ డీలింగ్ అసిస్టెంట్ ఎమ్ తనుజ, టెక్నికల్ అసిస్టెంట్ ఎన్ అనిల్ కుమార్,శిక్షరులు ఎమ్ సత్యం, పి మధు సూదన్ రావు, ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో ఘనంగా జరిగిన అంగన్వాడి గ్రాడ్యుయేషన్ డే

- కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్

**తల్లాడ, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఐమండల పరిధిలో అన్నారుగూడెం గ్రామం నందు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.ఈ గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలకు గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కె.వి) హాజరయ్యారు. ముందుగా వారు పిల్లలకు న్యూట్రిషన్, అక్షరాభ్యాసం, గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి పిల్లలకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రీ స్కూల్ ఎద్యుకేషన్ లో భాగంగా తదుపరి పిల్లలు ప్రైమరీ స్కూల్ లో అడ్మిషన్ పొందేందుకు సర్టిఫికెట్స్ అందజేశారు. సాంస్కృతిక ఆటల పోటీలలో గెలుపొందిన పిల్లలకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్ లు మాట్లాడుతూ



మన గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల పనితీరు చాలా బాగుందని, ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో కూడా పిల్లలకు ఉంచి ఫ్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అందజేయాలని గర్భిణీలకు, చంటి పిల్లలకు సరైన న్యూట్రిషన్ అందించి వారి ఆరోగ్య స్థితిని మెరుగుపరిచి బావి భారత పౌరులుగా తయారు చేయాలని వారు సూచించారు. ముఖ్యంగా అంగన్వాడి కేంద్రాలను



సమర్ధవంతంగా అడ్మినిస్ట్రేట్ చేస్తున్న సిడిపిఓ, సూపర్వైజర్లకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అంగన్వాడి టీచర్లకు ఆయాలకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు ఈ సందర్భంగా వారు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బందని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, విద్యా, వైద్యా, ఆరోగ్య, పంచాయతీ రాజ్, ఈ జి యస్, రెవెన్యూ, ఆశా కార్యకర్తలు, మల్టీపర్పస్ తదితర అన్ని విభాగాల సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కల్లెడ చెరువు ముందు పంట పొలాల్లో మంటలు అంటుకొని ఇబ్బందులకు గురైన రైతులు



**పర్వతగిరి, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో కల్లెడ చెరువు సమీపంలో ఉన్న రైతుల పంట పొలాల్లో గడ్డివాములు బోర్ల పైపులు పొలంలో ఉన్న పాడి పశువులకు గడ్డి కూడా పెట్టుకోక ముందే నిప్పు పడటంతో రైతులందరికీ సమాచారం ఇచ్చి నిప్పును అర్పించిన జగపతి నాయక్. నష్టపోయిన రైతులను పరిస్తితి అగమ్య గోచరంగా మారింది. రైతుల బోరు బావులు, కరెంట్ వ్యవస్థ పూర్తిగా దగ్ధమైంది దాదాపు 10లక్షల మేర రైతులకు తీరని నష్టం జరిగింది. ప్రభుత్వం పెద్ద మనసుతో నష్టపోయిన రైతులకు అండగా నిలబడి ఆర్థిక సహాయం అందించాలని, స్థానిక రైతులు వేడుకుంటున్నారు.

# మాజీ మావోయిస్టుల ముఖ్య సమావేశం

**వరంగల్, ఏప్రిల్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో కొంతమంది మాజీ మావోయిస్టులు నేడు కార్మికుల దినోత్సవం సందర్భంగా ఒక ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. గతంలో మావోయిస్టు పార్టీలో పని చేసి లొంగిపోయిన వారు దాదాపు 100 మంది వరకు ఈ సమావేశంలో పాల్గొనే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే వీరు ఒక ప్రముఖ రాజకీయ నాయకుడితో పలు దఫాలుగా మంతనాలు జరిపినట్లు సమాచారం. నేటి సమావేశం అనంతరం, రాజకీయ పరిణామాలలో భాగంగా వీరు ఒక రాజకీయ పార్టీలో చేరే అవకాశమున్నట్లు చర్చ జరుగుతోంది.అయితే, దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. ప్రస్తుతం ఇది కేవలం విశ్వసనీయ సమాచారం ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉన్నందున, మరిన్ని వివరాలు అధికారిక ప్రకటన అనంతరం తెలియనున్నాయి.ఈ సమాచారాన్ని తెలుసుకున్న రాష్ట్ర నిఘా వర్గాలు ఆరా తీయడం మొదలు పెట్టాయి అని తెలుస్తోంది రాష్ట్ర చరిత్రలో మాజీ మావోయిస్టులు అందరూ కలిసి ఒకే వేదిక మీదకు చేరబోతున్నారన్న సమాచారంతో అటు పోలీసు వర్గాల్లో ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసిందని విశ్వసనీయ సమాచారం..





# అభివృద్ధి శిల్పులు... హక్కుల్లో వెనుకబడిన కార్మికులు

**జమియతుల్ ఉలేమా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్**

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచవ్యాప్తంగా "కార్మిక దినోత్సవం"ను జరుపుకుంటారు. ఈ రోజు కార్మికుల శ్రమ, త్యాగాలు మరియు వారి హక్కులను వెలుగులోకి తేవడానికి ఉద్దేశించబడింది. అయితే వాస్తవంలో కార్మికుల హక్కుల గురించి మాట్లాడే సమయంలో చాలా మంది తమ స్వార్థ ప్రయోజనాలను ముందుకు పెట్టి న్యాయం చేయడంలో వెనుకబడుతారు అనే చేదు నిజం ఉంది,నేడు మనం చూస్తున్న అభివృద్ధిఎత్తైన భవనాలు, ఆధునిక రహదారులు, పరిశ్రమలు లేదా సాంకేతిక పురోగతిఇవన్నీ కార్మికుల చెమట, కష్టం ఫలితమే. ఫ్యాక్టరీల ఉత్పత్తి అయినా, కంపెనీల విజయాలైనా, ప్రతి చోట కార్మికుల కృషి ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ అభివృద్ధికి పునాది వేసిన కార్మికులే తమ ప్రాథమిక అవసరాలకు కూడా దూరంగా ఉంటున్నారు,ఇస్లాం కార్మికులకు గౌరవాన్ని మాత్రమే కాదు, వారి హక్కులను కూడా స్పష్టంగా నిర్ధేశించింది. ప్రవక్త ముహమ్మద్ నీ సల్లల్లాహు అలైహి వసల్లం కార్మికులను "సోదరులు"గా సంబోధిస్తూ, వారితో మంచి ప్రవర్తన చేయాలని ఉపదేశించారు. ఒక హదీస్‌లో "కార్మికుడి చెమట ఎండకముందే అతని కూలీ ఇవ్వాలి" అని చెప్పబడింది, ఇది సమయానికి వేతనం చెల్లించే ప్రాముఖ్యతను తెలియజేస్తుంది,ఇస్లామిక్ బోధనల ప్రకారం కార్మికుల ముఖ్య హక్కులు ఇవి: మొదట, కూలీని సమయానికి మరియు పూర్తిగా చెల్లించాలి, తద్వారా దోపిడీ జరగకుండా ఉంటుంది, రెండవది,



పని ప్రకారం సరైన వేతనం నిర్ణయించాలి; తక్కువ కూలీ ఇవ్వడం అన్యాయం, మూడవది కార్మికుడి సామర్థ్యానికి మించి పని వేయకూడదు, నాలుగవది, గౌరవంతో మరియు మంచి ప్రవర్తనతో వ్యవహరించాలి।ఐదవది, పని ప్రారంభానికి ముందు కూలీ మరియు నిబంధనలను స్పష్టంగా నిర్ణయించాలి, ఇస్లాం హక్కుల గురించి మాత్రమే కాకుండా నైతిక బాధ్యతలను కూడా గుర్తుచేస్తుంది. మరో హదీస్ ప్రకారం, కార్మికునితో పూర్తిగా పని చేయించుకుని అతనికి కూలీ ఇవ్వని వ్యక్తి న్యాయదినాన కఠినంగా ప్రశ్నించబడతాడు. ఇది కార్మికుల హక్కుల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది,నేటి ప్రపంచంలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారుతక్కువ వేతనాలు, బలవంతపు శ్రమ, బాల కార్మికత్వం మరియు ప్రాథమిక హక్కుల లేమి. ప్రపంచ స్థాయిలో ఇది ఒక తీవ్రమైన సమస్యగా మారింది. చాలా మంది కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ఆరోగ్య సదుపాయాలు పొందడం మరియు సురక్షితమైన పని వాతావరణం పొందడంలో వెనుకబడి ఉన్నారు. ఇది మన మనస్సాక్షికి ప్రశ్నగా నిలుస్తుంది,మరొక విషాదకరమైన విషయం ఏమిటంటే, కార్మికుల కష్టంతో పరిశ్రమల యజమానులు అపారమైన సంపద సంపాదిస్తారు, కానీ కార్మికులు మాత్రం పేదరికంలోనే జీవించాల్సి



వస్తుంది. న్యాయం ఏమిటంటే, ఒక వ్యాపారాన్ని అభివృద్ధి చేసిన కార్మికుల హక్కులను పూర్తిగా కాపాడాలి,కార్మిక దినోత్సవం మనకు ఒక సందేశం ఇస్తుంది: ఇది కేవలం ఒక రోజు ఉత్సవంగా కాకుండా, కార్మికుల హక్కులను నిజంగా అమలు చేసే దిశగా అడుగులు వేయాలి. ఇస్లాం సూచించిన సమతుల్యమైన మరియు న్యాయమైన విధానం అమలు చేస్తే సమాజంలో శాంతి, సమానత్వం మరియు అభివృద్ధి సాధ్యమవుతుంది,చివరగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే, కార్మికులు కేవలం ఒక వర్గం కాదువారు సమాజానికి వెన్నెముక. వారి గౌరవం, వారి హక్కుల రక్షణ మరియు వారితో న్యాయం చేయడం ఒక సుసంస్కృత సమాజానికి గుర్తు. నిజమైన అభివృద్ధి కోరుకుంటే, కార్మికులకు వారి హక్కులను ఇవ్వాల్సిందేఅదే మన సమిష్టి విజయానికి మార్గమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమియతుల్ ఉలేమా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ అన్నారు.

# బుమ్రా కూడా మనిషే..
# మరమనిషి కాదు


• ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్



పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. బుమ్రా కూడా మనిషేనని, ఫామ్ కోల్పోవడం సహజమేనని ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ అన్నాడు. అతనికి ముంబై ఇండియన్స్ అండగా ఉంటుందని స్పష్టం చేశాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. 4 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ తీయకుండా 54 పరుగులు సమర్పించుకున్నాడు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా రెండు వికెట్లు మాత్రమే తీసాడు. బుమ్రా ఐపీఎల్ కెరీర్‌లోనే ఈ సీజన్ అతనికి వరస్ట్‌గా మారిపోయింది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కీరన్ పొలార్డ్.. బుమ్రా వైఫల్యం గురించి మాట్లాడాడు. 'ఏ ఆటగాడైనా సరైన ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంటాం. సదరు ఆటగాడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్‌ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతను ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో మనం చూశాం. బుమ్రా కూడా మనిషే కదా.. అతను కూడా తప్పులు చేస్తాడు. కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గట్లు రాణించ లేకపోయాడు. అయినా.. ఇప్పటికీ అతను వరల్డ్ నంబర్‌వన్ బౌలర్. అలానే మా ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్.

# అగ్రస్థానంపై కన్నేసిన ఆర్సీబీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేదికగా నేడు మరో రసవత్తపోరుకు రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో ఆతిథ్య గుజరాత్ టైటాన్స్ జట్టుతో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవాలని ఆర్సీబీ చూస్తుండగా.. మరో విజయాన్ని తమ ఖాతాలో వేసుకోని ప్లేఆఫ్స్‌కు మార్గం సుగమం చేసుకోవాలని గుజరాత్ జట్టు ప్లాన్ చేస్తోంది. ఐపీఎల్ పాయింట్ల పట్టిక ప్రకారం.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 6 గెలిచింది. ం1.919 నెట్ రన్ రేట్‌తో టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఒకవేళ గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లో గెలిస్తే.. ఆర్సీబీ అగ్రస్థానానికి చేరుతుంది. ఆర్సీబీ ఆడిన గత 5 మ్యాచ్‌లను పరిశీలిస్తే 4 విజయాలు ఉండడం విశేషం. అలాగే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్ జట్టు ఆడిన 8 మ్యాచ్‌ల్లో 4 మ్యాచ్‌ల్లో విజయం సాధించి.. పాయింట్ల పట్టికలో -0.475 నెట్ రన్ రేట్‌తో 5వ స్థానంలో నిలిచింది.



ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గురువారం అనగా ఏప్రిల్ 30న, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు జరుగుతుంది. టాస్ రాత్రి 7 గంటలకు ఉంటుంది. ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్ లేదా జియో హాట్‌స్టార్ వేదికలా ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు 7 సార్లు తలపడ్డారు. అందులో ఆర్సీబీ 4 మ్యాచ్‌ల్లో గెలుపొందగా.. గుజరాత్ టైటాన్స్ 3 మ్యాచ్‌ల్లో నెగ్గింది. దీన్ని బట్టి పరిశీలిస్తే గుజరాత్‌పై ఆర్సీబీ పైచేయిగా ఉంది. అయితే నేడు జరిగే మ్యాచ్‌లో ఏం జరుగుతుందో చూడాలి. ఈ రెండు టీమ్స్ కలిసి ఏప్రిల్ 24న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో తలపడ్డారు. ఆ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో గెలిచింది. జీటీ 205/3 స్కోరు చేసింది. ఇప్పుడు లీగ్ దశలో మరోసారి ఇరు జట్లు తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ సెంచరీ సాధించగా, శుభ్‌మన్ గిల్ 32 పరుగులు చేశాడు. ఆర్‌సీబీ లక్ష్యాన్ని ఛేదించి, 206/5 స్కోరుతో ముగించింది. విరాట్ కోహ్లీ 81 పరుగులు చేయగా, దేవదత్ పడిక్కల్ 55 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో టోర్నీలో అత్యధిక పరుగులు రాబట్టి విరాట్ కోహ్లీ ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. అలాగే గుజరాత్ టైటాన్స్ జట్టుపై అతని సగటు 60కి పైగా ఉంది. అలాగే అత్యధిక పరుగులు సాధించిన వారిలో గుజరాత్ టైటాన్స్ తరపున పోటీలో ఉన్నాడు.

# సూర్య ఆటపై మండిపడుతున్న
# అభిమానులు



2026 ఐపీఎల్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన ముంబయి ఇండియన్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ముఖ్యంగా ఆ జట్టు స్టార్ ప్లేయర్ సూర్య కుమార్ యాదవ్ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లోనూ ఇదే పరిస్థితి. ఐదు పరుగులే చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఈ సీజన్‌లో ఎనిమిది మ్యాచ్‌లు ముగిసినా సూర్య నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. దీంతో "స్కై"పై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. అతడి కెరీర్ ముగిసినట్లేనా అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.ఈ సీజన్‌లో సూర్యకుమార్ పూర్తిగా ఫామ్ కోల్పోయాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 20.25 సగటున 162 పరుగులు మాత్రమే చేశాడు. సగటు మరీ దారుణంగా ఉంది. స్ట్రైక్ రేట్ 140.87 నమోదైంది. అయితే మిడిలార్డర్‌లో బాగా ఆడతాడనుకున్న స్కై ఈ సీజన్‌లో సత్తా చాటలేకపోతున్నాడు. చివరి ఆరు ఇన్నింగ్స్‌లో సూర్య వరుసగా 6, 33, 0, 15, 36, 5 స్కోర్లు చేశాడు. అప్పుడప్పుడు మెరిసినా, ఈ సీజన్‌లో గేమ్‌ఛేంజర్ లాంటి ఆట మాత్రం ఆడలేకపోయాడు. ముంబయి ఇండియన్స్ మిడిల్ ఆర్డర్‌కు సూర్యకుమార్ ఎంతో కీలకం. ఓపెనర్లు కష్టపడుతున్న సమయంలో బాధ్యత తీసుకోవాల్సిన అతడు తరచూ నిరాశ పరుస్తున్నాడు.సూర్యకుమార్ ఫామ్ విఫలమవుతుండటంపై సోషల్‌మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలోలాగా సూర్య ఎందుకు ఆడలేకపోతున్నాడని, అతడి పేలవ ప్రదర్శన వల్ల టీమ్ నుంచి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందా అంటూ కామెంట్లు పెడుతున్నారు. కీలక మ్యాచ్‌లలో రాణించలేకపోతున్నాడని అంటున్నారు. సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్ స్టార్ బ్యాటర్లలో ఒకడు. 'సూర్య కంప్లీట్‌గా ఫామ్ కోల్పోయాడు. అసలు అతడు టచ్‌లోనే లేడు. ఇలాంటి వ్యక్తి టీమ్ఇండియాకు ఎలా నాయకత్వం వహిస్తున్నాడో అర్థం కావట్లేదు. కెప్టెన్ అనేవాడు ముందుండి జట్టును నడిపించాలి. కానీ అతడు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. ఇది ఇలాగే కొనసాగితే అతడు అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కెప్టెన్సీ అనేది ప్రదర్శన ఆధారంగా వస్తుంది' అని ఓ నెటిజన్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. అలాగే 2024 సౌతాఫ్రికాతో సిరీస్ నుంచే సూర్య ఫామ్‌లో లేడని, అతడు 2025 ఆసియా కప్‌లోనూ విఫలమయ్యాడని మరో నెటిజన్ పోస్టు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లోనూ సూర్య ఒక్క మ్యాచ్‌లో మాత్రమే రాణించాడని రాసుకొచ్చాడు. సూర్య కెరీర్ దాదాపు ముగిసినట్లే! 2028 టీ20 వరల్డ్‌కప్ కోసం టీమ్ఇండియా ఇప్పట్నుంచే కొత్త కెప్టెన్‌ను నియమించి ప్రిపరేషన్ ప్రారంభించాలని మరో యూజర్ అన్నాడు. అయితే మరికొంత మంది మాత్రం సూర్యకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సూర్యకు బ్యాడ్ ఫేజ్ నడుస్తుందని, కొంత ఓపిక పడితే అతడు సెట్ అవుతాడని భారీ ఇన్నింగ్స్‌తో కమ్‌బ్యాక్ అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. అయితే సూర్య ఇప్పటికైనా ఫామ్ అందుకొని పరుగులు సాధించాల్సిన అవసరం ఉంది. లేదంటే టీమ్ఇండియాలో అతడి స్థానం కూడా గల్లంతయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుత ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ, ప్రియాంశ్ ఆర్య లాంటి కుర్రాళ్లు రాణిస్తుండడం, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఆకట్టుకుంటుండంతో జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ ఏర్పడుతుంది. అందుకే 35ఏళ్ల సూర్యను టీ20 జట్టులో కొనసాగించే ఆలోచన మేనేజ్‌మెంట్ చేయదని వాదనలు వినిపిస్తున్నాయి.





# ఐపీఎల్‌లో దుమ్మురేపుతున్న
# సన్‌రైజర్స్..

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తూ.. ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తుంది. వరుసగా 5 విజయాలతో అదరగొట్టింది ఎస్ఆర్‌హెచ్ టీమ్. కేవలం మ్యాచ్‌ల్లో విజయాలతోనే కాకుండా.. వ్యక్తిగత అవార్డుల పరంగా కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆధిపత్యం చాటుతోంది. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ రేసుల్లో టాప్‌లో సన్‌రైజర్స్ నిలిచింది. బ్యాటింగ్ విభాగంలో స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో ఏకంగా 209.35 స్ట్రైక్ రేట్ తో 425 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన సూపర్ బ్యాటింగ్‌తో జట్టుకు మంచి ఆరంభాలు అందిస్తున్నాడు. ఇక అభిషేక్ శర్మకు తోడుగా కాటేరమ్మ కొడుకు హెన్రిచ్ క్లాసెన్ కూడా సూపర్ ఫామ్‌తో అదరగొడుతున్నాడు. క్లాసెన్ కూడా 414 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతూ ఉన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో మిడిల్ ఓవర్లలో జట్టుకు స్థిరత్వాన్ని అందిస్తూ భారీ స్కోర్లను అందిస్తున్నాడు. మరోవైపు బౌలింగ్ విభాగంలో ఇషాన్ మలింగా కళ్లు చెదిరే ప్రదర్శనతో పర్పుల్ క్యాప్ రేస్‌లో మొదటి స్థానానికి దూసుకొచ్చాడు. 9 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి టాప్‌లో నిలిచాడు. అతని బౌలింగ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. డెత్ ఓవర్లలో మలింగ వేసే యార్కర్లు, వేరియేషన్స్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నాయి. అలాగే బౌలింగ్‌లో ఇషాన్ మలింగా తర్వాత భువనేశ్వర్ కుమార్, జోఫ్రా ఆర్చర్‌లు కూడా వికెట్ల వేటలో దూసుకొస్తున్నారు.



# నా సక్సెస్ సీక్రెట్ ఇదే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న అభిషేక్, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించాడు. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు, తన టీమ్ మేట్ ట్రావిస్ హెడ్ ప్రభావం తన బ్యాటింగ్ శైలిపై చాలా ఎక్కువగా ఉందని అభిషేక్ పేర్కొన్నాడు. జియో స్టార్ తో జరిగిన సంభాషణలో అభిషేక్ తన మనసులోని మాటలను పంచుకున్నాడు. హెడ్ తన బ్యాటింగ్ అప్రోచ్ ను ఎలా మార్చాడో, మైదానంలో భయం లేకుండా ఎలా ఆడాలో నేర్పించాడో వివరించాడు. ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి రాకముందు నుండే తాను అతని ఆటను గమనిస్తున్నానని, దాదాపు ఏడాదిన్నర కాలంగా అతని బ్యాటింగ్ స్టైల్ తనను ఆకట్టుకుందని అభిషేక్ తెలిపాడు. అతను తన టీమ్ మేట్ అయినప్పుడు తాను చాలా సంతోషించానని, అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ఒక గొప్ప అనుభవమని వెల్లడించాడు. అతనితో మాట్లాడినప్పుడు మొదట అడిగింది అతని బ్యాటింగ్ మైండ్‌సెట్ గురించేనని, మూడు ఫార్మాట్లలోనూ అతను బౌలర్లపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తాడో తెలుసుకోవాలని అనుకున్నానని అభిషేక్ చెప్పాడు. బ్యాటింగ్ విషయంలో ట్రావిస్ హెడ్ చాలా సింపుల్ ప్లాన్ ఫాలో అవుతాడని అభిషేక్ తెలిపాడు. "బంతిని జాగ్రత్తగా గమనించు, మొదటి బంతి నుండే బాదగలనని నీకు అనిపిస్తే ఏమాత్రం ఆలోచించకుండా షాట్ ఆడేయ్ అని హెడ్ నాకు సలహా ఇచ్చాడు. ఐపీఎల్ ప్రాక్టీస్ సెషన్లలో నేను అదే ఫాలో అయ్యాను. ఇప్పుడు నా

# రియాన్ పరాగ్‌కు
# భారీ షాకిచ్చిన బీసీసీఐ!



రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ సిగరెట్ వివాదాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. అతడి మ్యాచ్ ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు పేర్కొంది. అలాగే పరాగ్ ఖాతాలో 1 డీమెరిట్ పాయింట్ కూడా చేర్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పరాగ్ ఐపీఎల్ నిబంధనలు ఉల్లఘించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.'పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి కోడ్ 2.21ను రియాన్ పరాగ్ ఉల్లంఘించాడు. దీనిని లెవెల్ 1 తప్పిదంగా భావిస్తూ అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ, 1 డీమెరిట్ పాయింట్ చేర్చుతున్నాం' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ పేర్కొంది. పరాగ్ కూడా తన తప్పును అంగీకరించినట్లు తెలిసింది. అలాగే మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ విధించిన ఫైన్‌ను స్వీకరించాడు. కాగా, ఇటీవల ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రియాన్ పరాగ్ చేసిన పని వివాదాస్పదం అయ్యింది. ఈ మ్యాచ్ సెకండ్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చొని ఉన్న పరాగ్ ఈ సిగరెట్ (ఎలక్ట్రిక్ సిగరెట్) తాగుతూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై పెద్ద దుమారమే రేగింది. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పనులు చేయడంపై నెటిజన్లు సైతం పరాగ్‌పై మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న బోర్డు ఈ మేరకు చర్యలు చేపట్టింది.

అయితే భారత్‌లో ఈ సిగరెట్ల వాడకంపై నిషేధం ఉంది. వీటిని కేంద్ర ప్రభుత్వం 2019లోనే బ్యాన్ చేసింది. ఎలక్ట్రిక్ సిగరెట్లు, ఆ పరికరాల ఉత్పత్తి, అమ్మకం, కొనుగోలు, వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీంతో పరాగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఎవరైనా సరే 'ప్రొహిబిషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ సిగరెట్స్ యాక్ట్ (రాజుజూా) 2019' ప్రకారం రూ. లక్ష జరిమానాతోపాటు, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# తిరుమల శ్రీనివాసుని సన్నిధిలో.. ఘనంగా బెల్లంకొండ శ్రీనివాస్ వివాహం





టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక ఇంటివాడయ్యారు. ఆయన తన కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. కావ్య రెడ్డితో కలిసి ఏడడుగులు వేశారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో బుధవారం రాత్రి వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవంలో వధూవరులు బెల్లంకొండ శ్రీనివాస్, కావ్య రెడ్డి సంప్రదాయ పట్టు వస్త్రాలలో మెరిసిపోయారు. నూతన దంపతులు చూడముచ్చటగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ శుభకార్యానికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సినీ రంగ ప్రముఖులు కూడా ఈ వేడుకకు విచ్చేసి కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, నిర్మాతలు, దర్శకులు కూడా ఈ పెళ్లికి హాజరై సందడి చేశారు.

అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమ అభిమాన హీరో కొత్త జీవితాన్ని ప్రారంభించడంతో అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొత్త దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నారు.

# మోదుగ ఆకుల గంపతో అనుపమ..

## 'భోగి' నుంచి ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్!

యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి'. ఈ చిత్రం నుంచి తాజాగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'కందుల సులోచన రాణి' అనే పవర్ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

విడుదలైన పోస్టర్‌లో అనుపమ పూర్తి గ్రామీణ యువతి అవతారంలో కనిపించారు. కాళ్లకు చెప్పులు లేకుండా మట్టి దారిలో నడుస్తూ, తలపై మోదుగ ఆకులు నింపిన పెద్ద గంపను మోస్తున్నారు. మరో చేతిలో ఆకులు, టిఫిన్ బాక్స్ పట్టుకుని ఉన్నారు. పాతకాలపు లంగావోణి, ఆమె ముఖంలో కనిపిస్తున్న దృఢమైన భావాలు పాత్రలోని తీవ్రతను సూచిస్తున్నాయి. వెనుక మట్టి ఇళ్లు, పశువులతో కూడిన పల్లెటూరి వాతావరణం కనిపిస్తోంది. ఈ చిత్రంలో సులోచన రాణి ప్రకృతితో మమేకమై జీవించే, ఎంతో ధైర్యంగల యువతిగా కనిపించనుందని తెలుస్తోంది. మోదుగ ఆకులతో విస్తరాకులు తయారు చేస్తూ జీవనం సాగించే ఆమె పాత్రలో సహనం, బలం రెండూ ఉట్టిపడతాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామంలో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో డింపుల్ హయతి మరో కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం, రంపచోడవరం, మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణను చిత్రబృందం పూర్తి చేసింది. తదుపరి షెడ్యూల్ మే మొదటి వారం నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభం కానుంది.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ, కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# ప్రశాంతంగా నిద్రపోవడానికి 2062 వరకు ఆగాలేమో



దక్షిణాది చిత్రసీమలో చెక్కుచెదరని అందంతో, తిరుగులేని క్రేజ్‌తో దూసుకుపోతున్న త్రిష ఇన్‌స్టాగ్రామ్ లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడూ గ్లామర్ ఫొటోలు, సినిమా అప్‌డేట్స్ ఇచ్చే త్రిష, ఈసారి తన వ్యక్తిగతమైన 'నిద్ర' గురించి చేసిన వింత లెక్క నెటిజన్లను అటు నవ్విస్తూనే, ఇటు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. "ఒక గంట నిద్రను కోల్పోతే, దాని నుండి కోలుకోవడానికి నాకు నాలుగు రోజులు పడుతుంది. ఈ లెక్కన నేను మళ్ళీ ప్రశాంతంగా నిద్రపోవాలంటే 2062 వరకు ఆగాల్సిందేమో" అంటూ త్రిష చేసిన కామెంట్ వైరల్ అవుతోంది. ఆమె సరదాగా అన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నాయో, ఆమె ఎంతటి పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. త్రిష ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్నారు. మెగాస్టార్ చిరంజీవితో భారీ సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర'తో పాటు, తమిళంలో సూర్యతో 'కరుప్పు' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఆమె డైరీ ఫుల్ అయిపోయింది. వరుస ప్రయాణాలు, రాత్రింబవళ్లు షూటింగులతో తీరిక లేకుండా గడపడం వల్లే ఆమెకు సరైన విశ్రాంతి దొరకడం లేదని స్పష్టమవుతోంది. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, రాజకీయ అరంగేట్రంపై జరుగుతున్న ప్రచారం వంటివి కూడా ఆమెను కొంత ఒత్తిడికి గురిచేస్తుండవచ్చు. అందుకే తనకున్న మానసిక అలసటను ఇలా చమత్కారంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.



## రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్' ఆగిపోయిందన్న వార్తల్లో నిజం లేదన్న టీమ్

ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి

'ధురంధర్' ఫ్రాంచైజీతో భారీ విజయాన్ని అందుకున్న బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు జై మెహతాతో కలిసి 'ప్రళయ్' అనే పోస్ట్-అపోకలిప్టిక్ థ్రిల్లర్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ వార్తలు గుప్పుమన్నాయి. రణ్‌వీర్‌కు, దర్శకుడికి మధ్య సృజనాత్మక విభేదాలు తలెత్తాయని, దాంతో సినిమాను పక్కన పెట్టారని ప్రచారం జరిగింది. ఈ పుకార్లపై చిత్రబృందానికి చెందిన సన్నిహిత వర్గాలు స్పందించాయి. 'ప్రళయ్' ఆగిపోయిందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు. "ప్రళయ్ సినిమా గురించి వస్తున్న ఊహాగానాలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్ ప్రకారమే ముందుకు సాగుతోంది" అని తెలిపారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆగస్టు నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, స్క్రిప్ట్‌ను రణ్‌వీర్, జై మెహతా ఇప్పటికే ఫైనల్ చేశారని పేర్కొన్నారు.

# లండన్ ప్రేమ కథతో ఆనంద్ దేవరకొండ 'ఎపిక్'..

బేబీ' బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. 'చ90ం: ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆదిత్య హాసన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ టీజర్ బుధవారం విడుదలై ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'చ90ం' సిరీస్‌లో మెప్పించిన ఆదిత్య పాత్ర చుట్టూనే ఈ సినిమా కథ తిరుగుతుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆ యువకుడు ఇంటి సభ్యుల ఒత్తిడితో పైచదువుల కోసం యూకే వెళతాడు. అక్కడ వైష్ణవీ చైతన్యతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయనేది ఈ టీజర్‌లో చూపించారు. ఆనంద్ దేవరకొండ తన సహజ సిద్ధమైన నటనతో మధ్యతరగతి యువకుడిగా ఒదిగిపోయారు. పక్కా లోకల్ అబ్బాయి ఫారిన్ వెళితే పడే ఇబ్బందులను కామెడీగా చూపిస్తూనే, మరోవైపు ఎమోషనల్ లవ్ ట్రాక్‌ను కూడా ఆదిత్య హాసన్ టచ్ చేసినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. యూకే నేపథ్యంలోని విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది. ఫస్ట్ సెమిస్టర్ అని టైటిల్‌లో ఉండటంతో ఇది యూత్, స్టూడెంట్స్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసినట్లు స్పష్టమవుతోంది.



# అందరినీ అలరించే సినిమా

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్... రైటర్–, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. 'గాయపడ్డ సింహం' విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వీసా స్టాంపింగ్ ఈవెంట్ నిర్వహించారు.



ఈ ఈవెంట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ "డైరెక్టర్ కశ్యప్‌కి ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది"అని అన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ "జేడీ, తరుణ్ ఇచ్చిన సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. శ్రీ విష్ణు ఈ సినిమాలో భాగం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాను. అందరినీ అలరించే సినిమా ఇది"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్, జేడీ చక్రవర్తి, ఫారియా అబ్దుల్లా, మానస చౌదరి, పవన్ సాదినేని, స్వీకర్ అగస్తి, శ్రీరామ్ ఆదిత్య, సాయి మార్తాండ, హుస్సేన్ షా కిరణ్, హసిత్ గోలి, సందీప్ రాజ్, సందీప్, భాను కిరణ్, దివ్య పాల్గొన్నారు.